క్లుప్తంగా

వైభవంగా వేణుగోపాల స్వామివారి తిరువీధి



వేణుగోపాలస్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తజనం

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న ధనుర్మాసోత్సవ పూజల్లో భాగంగా నగరసంకీర్తన, మేల్కొలుపులు, భజన పాటలతో భక్తులు బుధవారం తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని బక్కుపేట, బళ్లకృష్ణాపురం, సీతానగరం, మరిపివలస, సూరంపేట, గాదెలవలస గ్రామాల్లో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయి. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా సువర్ణముఖి నదీతీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో గోవింద మాలాధారణ చేసిన భక్తులు స్వామివారిని ఆలయ అర్చకులతో కలిసి పల్లకీలో అధిష్ఠించి తిరువీధి చేశారు.

పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లు



ఎల్ఈడీ లైట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శోభారాణి

పార్వతీపురంటౌన్: ఎంపీ నిధులతో మండలంలోని 17 పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మజ్జి శోభారాణి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్ కోరిక మేరకు 17 పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ లైట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జావేద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పాడి రైతులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి శైలజ

కురుపాం: పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని గుమ్మ పశువైద్యాధికారిణి శైలజ సూచించారు. జి.శివడ పంచాయతీ పరిధిలోని కించాయిగూడ గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నట్టల నివారణ, మేక పిల్లల సంరక్షణ జాగ్రత్తలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. అలాగే నట్టల నివారణకు మందులను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏఓలో ఇంటర్వ్యూలు



పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: పాలకొండ పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు ఐటీడీఏలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ఇంటర్వ్యూలు చేశారు. సూపర్‌వైజర్ 1 పోస్టు, పంపుబాయ్ 7 పోస్టులకు ఇంటర్వ్యూలు జరిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఏఏఓ విజయరాణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు సభ్యత్వాల నమోదు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న మహిళా మార్ట్‌కు డ్వాక్రా మహిళల నుంచి సభ్యత్వాల నమోదు సంపూర్తిగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం వైకేపీ కార్యాలయంలో మహిళా మార్ట్ కమిటీ సభ్యులు, సీసీలు, వీఓఏలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్ సభ్యత్వాల నమోదు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన నిత్యావసర సరుకులన్నీ సరసమైన ధరలకే లభించేలా ఏర్పాటు చేయనున్న మహిళా మార్ట్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగించుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీ నిధి, ఉన్నతి వంటి పథకాలతో పాటు ప్రభుత్వం ద్వారా పొందిన వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలతో మహిళా సభ్యులు ఉపాధి అవకాశాలు పెంపొందించుకునేలా ప్రోత్సాహం అందివ్వాలని, వైఎస్సార్ ఆసారాకు సంబంధించి అర్హులైన సంఘాలకు చెందిన మహిళల వివరాలను యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.

యువక్రీడాకారులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే జోగారావు



వంతరాం సచివాలయం పరిధిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్‌పోటీలో ఆడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం యువ క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని వంతరాం సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని వాలీబాల్ గేమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువ క్రీడాకారులకు ఇటువంటి కార్యక్రమాల వల్ల వారిలో నైపుణ్యం వెలుగులోకి వస్తుందని చెప్పారు. ఆ ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నైపుణ్యంతో పాటు శారీరకంగా ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని, నైపుణ్యంతో ఎదిగి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై గ్రామానికి, నియోజకవర్గానికి, జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకువచ్చే అవకాశాలున్నాయన్నారు. షెడ్యూల్ ప్రకారం క్రీడలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బాలసన్యాశినాయుడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, పి.రామకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చినవంతరాం గ్రామస్తుల సంతృప్తి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

మండలంలోని చినవంతరాం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కావడంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తంచేసి ఎమ్మెల్యే జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు చినవంతరాం రోడ్డును ఎమ్మెల్యే జోగారావు బుధవారం పర్యవేక్షించారు. వంతరాం నుంచి చినవంతరాం వరకు బీటీ రోడ్డు పనులు జరుగుతుండడంతో పరిశీలించి రోలింగ్ ఎక్కువగా ఉండే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. అందులో భాగంగా గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. మీకు కావాల్సిన బీటీ రోడ్డు పనులు పూర్తికావస్తున్నాయని ఇంకా గ్రామానికి సంబంధించి అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటే వెంటనే తెలియపరచాలని కోరారు. గ్రామస్తులు ఎటువంటి అసౌకర్యాలకు గురికావద్దని సమస్యలు ఉంటే సర్పంచ్‌కు తెలియచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సన్యాశినాయుడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పి.రామకృష్ణ, జగన్, కె.మోహనరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే శరీర రుగ్మతలు మాయం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రీడలు వ్యక్తి శరీరంలో ఉన్న రుగ్మతలు తరిమికొట్టడానికి, మానసిక ఉల్లాసం కలిగించడానికి దోహదపడతాయని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బూర్జ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల పోటీల్లో భాగంగా రెండవ రోజు షటిల్‌కాక్ పోటీలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు యువకుల్లో ఉత్సాహాన్నిస్తాయని, గుండె, కీళ్ల, ఊబకాయం తదితర రకాల వ్యాధుల నివారణకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం వ్యాయామ విద్యకు ఇస్తున్న పోత్సాహాన్ని గ్రామాల్లో యువకులంతా వినియోగించుకుని, ఆరోగ్యవంతులు కాగలరని ఆశిస్తున్నామన్నారు. అనంతరం అదే క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు ఖోఖో ఆటలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు వెంకటాపురం, బూర్జ, పెదంకలాం సచివాలయాల కన్వీనర్లు పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లుల్లో రికార్డుల పరిశీలన



చిన్నారాయుడుపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని రైతుల వరిచేను కళ్లాల్లో ఉన్న ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో శరవేగంగా కొనుగోలు జరుగుతోందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తామరఖండి, చిన్నారాయుడుపేట, కాశీపేట రైస్ మిల్లులను, మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు చిన్నారాయుడుపేటలోని వెంకటపద్మసాయి రైస్‌మిల్లులో సరుకుల నిల్వలను పరిశీలించినట్లు తెలియజేశారు. అలాగే గ్రామాల్లోని రైతుల ఇళ్లలో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని రైతులనుంచి ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయమై బ్యాంక్ గ్యారెంటీలు 1:3 నిష్పత్తిలో ఇవ్వడంతో ధాన్యం సేకరణ జరుగుతోందని చెప్పారు. ఈ మేరకు మండలంలోని అన్ని రైస్ మిల్లుల యాజమాన్యాలు బీజీలు తీసినట్లు వస్తున్న సమాచారంతోనే మండలంలోని రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేస్తున్న బియ్యం నిల్వలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు యజమాన్యం ప్రతినిధులు ఎం.ధనుంజయనాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అవగాహన ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురంటౌన్: విద్యార్థులు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండి చుట్టుపక్కల వారిని చైతన్యవంతులను చేసి ప్రమాదాలను నియంత్రించవచ్చునని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడి ఈ మూడింటిలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలను ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. ఇళ్లలో వంట గ్యాస్ ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా నియంత్రించాలనే అంశంపై విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, డి. గోపీమోహన్ కుమార్, టి.త్రినాథ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పత్తి విక్రయాలు



నేరడి-బీలో అమ్మకానికి సిద్ధం చేసిన పత్తి బస్తాలు

భామిని: మండలంలో ఎట్టకేలకు పత్తి కొనుగోలు ప్రారంభమైంది. ఈ ఏడాది తుపాన్ల కారణంగా పత్తి రైతు చేతికి రావడం ఆలస్యమైంది. దీంతో మార్కెట్‌లో తగిన గిట్టుబాటు లేకపోవడంతో రైతులు విక్రయానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7025లుగా ఉంది. దీని కంటే తక్కువగా క్వింటా రూ.6,300లకే విక్రయించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం మండలానికి దూరంగా రాజాంలో ఏర్పాటు కావడంతో అక్కడివి తీసుకువెళ్లి విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గతంలో దీపావళి నుంచే పత్తి అమ్మకాలు జరిగేవి. ఈ ఏడాది పరిస్థితులు మారి పత్తి కొనుగోలుదారులు కుమ్మక్కు కావడంతో రైతులకు గిట్టుబాటు ధర తగ్గించడంతో వెనుకంజ వేశారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో ఆర్థిక అవసరాల రీత్యా పత్తి రైతులు కాస్త తగ్గి తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే పత్తిని విక్రయిస్తున్నారు.

సమీకృత వ్యవసాయ విధానమే మేలు



మండలో వాటర్ షెడ్‌ను పరిశీలిస్తున్న రైతులు

సీతంపేట: సమీకృత వ్యవసాయ విధానమే మేలని అర్ప్ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. ఒడిశాకు చెందిన కలహండి జిల్లా నుంచి 80 మంది క్షేత్ర స్థాయి సందర్శనకు బుధవారం ఇక్కడకు వచ్చారు. మండ వాటర్ షెడ్‌ను పరిశీలించారు. చెరువులు, చెక్‌డ్యాంలు, నేల సంరక్షణ పనులను చూశారు. చిరుధాన్యాల సాగు, వాటి వల్ల వచ్చే లాభాలను తెలుసుకున్నారు. ఎఫ్‌పీఓ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, జీవామృతం, కషాయాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో మన్య సహజ సీఈఓ బి.శంకరరావు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

అకౌంటింగ్‌పై శిక్షణ

పాలకొండ రూరల్: కామర్స్ చదువుతున్న ఇంటర్ విద్యార్థులు అకౌంట్స్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని జనచేతన స్వచ్ఛంద నిర్వహకులు శశిభూషణ చౌదరి అన్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట, సరుబుజ్జిలి మండలాలకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు బుధవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పాలకొండ చేరుకున్నారు. ఇక్కడి స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారేతర సంస్థలను సందర్శించారు. ఈ క్రమంలో శశిభూషణ చౌదరి అకౌంటింగ్ పాలసీ, నిబంధనలు, బిల్స్, ఓచర్స్‌లో రకాలపై అవగాహన కల్పించారు. నగదు పుస్తకం, ఆవర్జా, అంకణా, వర్తకపు ఖాతా, లాభ నష్టాల ఖాతా, ఆస్తీ, అప్పుల పట్టీ, ఆడిట్ ఆవశ్యకతపై కామర్స్ అధ్యాపకులు డి.రాంప్రసాద్, రవి తదితరులు వివరించారు.

ఈవీఎంలలపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: ఈవీఎంల ద్వారా ఓటు వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంగళాపురం సర్పంచ్ కరణం బాబ్జీరావు అన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటరినింగ్ అధికారిణి, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పన కుమారి ఆదేశాలతో సిబ్బంది బుధవారం ఈవీఎం యంత్రాలతో ఓటింగ్ వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామీణల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక విధానంపై అధికారులు బృందం పైల ఈశ్వరరావు, ఎ.ధర్మారావు, జి.ప్రసాదరావు, ఎస్.రాజారావు తదితరులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని యరకారాయపురం, గోపాలపురం, అంపిలి, అన్నవరం, వడమ ప్రాంతాల్లో ఎన్నికల సిబ్బంది ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల మధ్య ఈవీఎంలపై ఓటర్లు వివరించారు.

కురుపాం ఎంపీడీఓగా అప్పారావు

కురుపాం: కురుపాం ఎంపీడీఓగా ఎస్.అప్పారావు బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇదివరలో ఇక్కడ పని చేసిన వి.వి.శివరామప్ప గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు గత నెల రోజులుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రమేష్‌కుమార్ విధులు నిర్వహించగా ప్రస్తుతం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.అప్పారావు పదోన్నతిపై కురుపాం ఎంపీడీఓగా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో విధులు నిర్వహిస్తానన్నారు.

అవగాహనతో ప్రమాదాలకు అడ్డుకట్ట

పాలకొండ రూరల్: అవగాహనతో ప్రమాదాలను అధిగమించవచ్చని పాలకొండ అగ్నిమాపక అధికారి జి.సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై మెలకువలు వివరించారు. ప్రమాదాలు సంభవిస్తే శాఖాపరంగా ఉపయోగించే పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సహజ వాయువులు, అత్యంత వేగంగా మండే వాయువుల గూర్చి, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై డెమో చేసి చూపించారు. కళాశాల ప్రిన్సిపాల్ పైల శంకరరావు, ఎస్ఎస్ఎస్ పీఓ వెలమల అప్పారావు, సహ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

నేడు పలు రహదారులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

కురుపాం : మండలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న రెండు బీటీ రోడ్లును ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి గురువారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాడి పంచాయతీలోని నాగరగూడ బీటీ రోడ్డును ఉదయం 10 గంటలకు, జి.శివడ నుంచి కోటకొండ రోడ్డును ఉదయం 11.30 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం



ఆరోగ్యశ్రీ కార్డుల బాక్స్‌లను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

సీతానగరం: ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షల విలువైన వైద్యసేవలు ఉచితంగా అందిస్తుందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 11,695 కుటుంబాల వారికి ప్రభుత్వం సమకూర్చిన జగనన్న ఆరోగ్యశ్రీ గుర్తింపు కార్డులను ఆరోగ్యశ్రీ సిబ్బంది వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదివరలో ఎటువంటి వ్యాధి వచ్చినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యసేవలు పేదలకు అందడం గగనంగా ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యసేవలు పొందడానికి ఆరోగ్యశ్రీకార్డులు ఉపయోగ పడతాయని చెప్పారు. కార్డులున్న వారికి రూ.25 లక్షల విలువైన వేద్యసేవలు ఉచితంగా అన్నిరకాల వ్యాధుల నివారణకు, శస్త్ర చికిత్సలకు ఉపయోగ పడతాయని తెలిపారు. ఆరోగ్య శ్రీకార్డులను పంచాయతీ కార్యదర్శులు, గ్రామవలంటీర్ల ద్వారా పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియ జేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, బి.ముకుందరావు, సీతానగరం, పెదంకలాం ఆరోగ్యమిత్ర ప్రతినిధులు డి.భాగ్యలక్ష్మి, జి.సురేష్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అవసరమైన పనులు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనుల ప్రణాళికలను తయారుచేసి వాటికి అనుగుణంగా ఉపాధి పనులు చేయించాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో 12పంచాయతీల మేట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు ముందస్తు ప్రణాళికలను తయారు చేయనున్నందున వాటిని పక్కాగా తయారుచేయాలని, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను ప్రణాళికలో పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి పనులు పక్కాగా జరిగేందుకు మేట్లు ఎంతో కీలకమని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఫేషియల్ హాజరును ప్రవేశపెడుతోందని, దానికి అనుగుణంగా వేతనదారులు ఉండాలని సూచించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ముందస్తు కొలతలు తీసుకుని పనులను నిర్వహించాలని సూచించారు. కొలతల్లో తేడాలుంటే వేతనదారుల వేతనాలు మారిపోతాయని సూచించారు. అదేవిధంగా బీమా ప్రీమియం కట్టించాలని పిలుపునిచ్చారు. ఫేషియల్ యాప్‌లో వేతనదారుల హాజరు తప్పనిసరిగా ఉండాలని, బీమా ప్రీమియంపై వేతనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలి



పెదపెంకి-3 ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలని ఎంఈఓ-1సామల సింహాచలం కోరారు. ఈ మేరకు మండలంలోని పెదపెంకి, భైరిపురం ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. వారి వర్క్‌పుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించి ఉపాధ్యాయులు వాటిని సక్రమంగా సవరిస్తున్నదీ లేనిది చూశారు. ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఉందని, వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించడం వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. ప్రాథమిక విద్య దశలో వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మెనూను పరిశీలించి వంటలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో కుష్టువ్యాధి రహిత సమాజ స్థాపన



కుష్టు వ్యాధి నివారణ ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సీతానగరం: కుష్టువ్యాధి రహిత సమాజస్థాపన ప్రభుత్వం, ప్రజలసహకారంతోనే సాధ్యపడుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఈ మేరకు కుష్టువ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో పీహెచ్‌సీ నుంచి మార్కెట్ వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాల వ్యాధుల నివారణ, నిర్మూలనకు అవసరమైన సమస్త వ్యాధులను పరిశీలించడానికి నిపుణులైన డాక్టర్లను నియమించిందని, ప్రభుత్వాస్పత్రుల్లో మందులు సమకూర్చినట్లు తెలియజేశారు. కుష్టువ్యాధి లక్షణాలున్న వారికి ఉచితంగా ఎంతఖర్చైనా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఇప్పటికే కుష్టువ్యాధి గణనీయంగా తగ్గిందని 10 వేల మందిలో ఒకరికి వ్యాధి లక్షణాలున్నట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ, సత్యవతి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు అన్నారు. నడుకూరు ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు బుధవారం అందజేశారు. పిల్లలకు మనమిచ్చే నిజమైన ఆస్తి చదువేనని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదలకు చదువు భారం కాకూడదని అమ్మ ఒడి ద్వారా ప్రతీ తల్లికి ఆర్థిక ఆసరా కల్పిస్తున్నారన్నారు. జగనన్న విద్యా కానుకలు అందజేస్తూ, ఇంటి భోజనాన్ని మరపిస్తూ జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తూ సర్కారు బడులను ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. చిదిమి గ్రామంలో సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.